


# కురుక్షేత్రంలో ధర్మసంస్థాపన

## భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



పాండవులు, కౌరవులు యుయుత్సువులై ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో అటు నిటు బారులు తీరారు. ఇరుపక్కలా అతిరధ మహారధులైన మహావీరులున్నారు. ఐతే - 'పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగేయుగే' అంటూ అవతారపురుషుడు శ్రీకృష్ణభగవానుడు పాండవులకు పెట్టని గోడగా నిలిచాడు.

కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవసైన్యాధిపతిగా మొదట భీష్ముడు, తదుపరి ద్రోణ, కర్ణులు పోరాడారు. శిఖండి నడ్డుపెట్టుకుని భీష్ముని, అశ్వత్థామ హతుడయ్యాడన్న అసత్యంతో ద్రోణుని, కృంగిన రధ చక్రాలనెత్తుకునే సమయాన నిరాయుధుడైన కర్ణుణ్ణీ - అర్జునుడు హతమార్చాడు. యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా సుయోధనుణ్ణి తొడలు విరగ్గొట్టి ఓడించాడు భీముడు.

శ్రీకృష్ణభగవానుని ఆధ్వర్యంలోనే - మహావీరులైన పాండవులు అధర్మయుద్ధానికి పాల్పడినప్పుడు - తమకు అధర్మం సమర్ధనీయమేనని సామాన్యులకు తోచవచ్చు. కానీ సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే భారత యుద్ధంలో అందుకు వ్యతిరేకంగా ఓ మహత్తర సందేశం గోచరిస్తుంది.

ధర్మరాజు సకల సంపన్నుడే కానీ జూదం అతడి బలహీనత. అది తెలిసిన సుయోధనుడు పాండవులను మాయాజూదంలో ఓడించి మోసంతో వారి రాజ్యాన్ని కాజేసాడు.. జరిగింది అన్యాయమని తెలిసినా ధర్మనందనుడు ఒప్పందానికి తలవంచి పన్నెండేళ్ళ వనవాసానికీ, ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికీ అంగీకరించాడు. ధర్మజుడి సహనంలో ముందు చూపున్నది. తనకు జూదమనే బలహీనత లేకపోతే కౌరవులు తనను మోసగించలేరని అతడికి తెలుసు. ఐనా బలహీనతలపై దెబ్బతీయడాన్ని రాజనీతిగ సమర్ధించి - ఆ విధంగా మున్ముందు జరగబోయే దాయాదుల సంగ్రామానికి యుద్ధతంత్రాన్ని సిద్ధం చేసాడు.

గడువు తీరాక సుయోధనుడు పాండవుల రాజ్యభాగాన్ని వెనక్కివ్వడం న్యాయం. కానీ పాండవ ద్వేషం, రాజ్యకాంక్ష అతడి బలహీనతలు. ఆ బలహీనతలే అతణ్ణి అధర్మానికి ప్రోత్సహించి కురుక్షేత్ర సంగ్రామానికి కారణమయ్యాయి. ఆ యుద్ధంలో పాండవులు ధర్మం తరపునా, కౌరవులు అధర్మం తరపునా పోరాడారు. ధర్మానికే జయం లభిస్తే అది న్యాయం కదా!

కౌరవ ప్రముఖుల్లో ప్రధముడు శాంతనవుడు. ఆయన భీష్మప్రతిజ్ఞతో పదివిని త్యాగం చేసిన మహనీయుడు. కురు సింహాసన సంరక్షణ భారాన్ని తనమీద వేసుకున్న మహావీరుడు. స్వానుభవంతో భవిష్యత్తును అంచనా వేయగలిగిన మహాజ్ఞాని. ఐతే అంతటి మహాజ్ఞానీ తను సంరక్షించాల్సింది న్యాయాన్నీ, ధర్మాన్నీ అనుకోలేదు. సింహాసనమంటే దానిమీద కూర్చున్న రాజే అనుకున్నాడు. ఆ రాజు పాల్పడిన అకృత్యాలకు - మాటలతో నిరసన తెలిపినా - చేతల్లో వాటికి కొమ్ము కాసాడు. ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని ఆపలేకపోవడం ఆయన వ్యక్తిత్వానికి మాయని మచ్చ. తన బలాన్నీ, జ్ఞానాన్నీ, రాజనీతినీ అక్రమాలను అదుపు చేయడానికి బదులు దుష్టుల సేవకు వినియోగించాడాయన. కురుక్షేత్ర యుద్ధంలో సగం రోజులాయనవే. అధర్మం తరపున పోరాడుతున్నానన్న మనోక్లేశం ఆయన్ను వేధించింది.

ఓటమిని కాంక్షించిన ఆయన్ను - రణభూమిలో విజయ పరంపర కంటే - అంపశయ్యమీద పడక ఎక్కువ సంతోషపెట్టింది. ఆయనకు మరణమొక విమోచనం. శిఖండిపై బాణాలు వేయనన్న ఆయన ప్రతిజ్ఞలో అహంకారమున్నది. మనిషికి అహంకారం కూడా బలహీనత. అర్జునుడు శిఖండి నడ్డుపెట్టుకోవడం యుద్ధనీతిగా అనుకోవాలి తప్ప అధర్మయుద్ధమనరాదు.

ధనుర్విద్యలో అద్వితీయుడనిపించుకున్న ద్రోణుడు కౌరవప్రముఖుల్లో ద్వితీయుడు. సుయోధనుడి సేవ ఆయన వ్యక్తిత్వానికి మాయనిమచ్చ తెచ్చింది. తన మాట వినని శిష్యుడి అకృత్యాలను నిరసించాడే తప్ప అతడి కొలువు మానుకునే ప్రయత్నం చెయ్యలేదు. పైగా కురుక్షేత్రంలో ఐదు రోజుల పాటు పాండవులను చీకాకు పరిచాడాయన. పాండవుల విజయాన్ని కాంక్షిస్తూ కౌరవుల తరఫున పోరాడే ద్వంద్వ ప్రవృత్తి ఆయనలో హర్షించ తగనది కాదు. తాను పద్మవ్యూహాన్ని రచించినప్పుడు - అర్జునుణ్ణి సంశప్తకులతో యుద్ధానికి పంపడం ఆయన అనుసరించిన యుద్ధనీతి. రణభూమిలో అభిమన్యుడు దుర్నిరీక్ష్యుడై వీరవిహారం చేస్తూంటే - కురువీరులందరూ ఒక్కుమ్మడిగా నలువైపులనుంచీ అతడి నెదిరించటం అధర్మ యుద్ధం. ఆ విధంగా రణభూమిలో అధర్మయుద్ధానికి కౌరవులే నాంది పలికారు - అదీ ద్రోణుడి ఆధ్వర్యంలో! ఆనాడు వారు అభిమన్యుణ్ణి అధర్మయుద్ధంలో చంపకపోతే - బహుశా కురుక్షేత్రసంగ్రామం ఆ రోజుతోనే పాండవులకు అనుకూలంగా ముగిసి ఉండేదేమో!

గెలుపుకోసం అధర్మయుద్ధాన్నే యుద్ధనీతిగా ప్రయోగించిన ద్రోణుణ్ణి కూడా పాండవులు అధర్మ యుద్ధంతో కాక యుద్ధనీతితో చంపారు. కనులముందు జరిగిన ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని సహించిన ద్రోణుడు - కనులుముందు లేని కన్నకొడుకు మరణానికి చలించి అస్త్రసన్యాసం చేసాడంటే ధర్మాధర్మ విచక్షణపరంగా ఆయనలో కరుడగట్టిన స్వార్ధాన్ని అర్ధం చేసుకోవచ్చు. ధర్మజుడి అసత్యం యుద్ధనీతి కావచ్చు కానీ - రణభూమిలో ద్రోణుడి అస్త్ర సన్యాసం హాస్యాస్పదం. పగతో రగులుతున్న దృష్టద్యుమ్నుడు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రాయోపవేశంతో మరణించిన ద్రోణుడి తల నరకడమూ ఆ వాతావరణానికి అసహజమనిపించదు.

మహాభారతంలో కర్ణ, సుయోధనుల అకృత్యాలు సువిదితమే. పదిహేను రోజుల యుద్ధానంతరం - ముందు కర్ణుడు, తర్వాత సుయోధనుడు యుద్ధరంగంలోకి వచ్చారు. అధర్మాన్ని యుద్ధనీతి గా మార్చిన వారికి - అధర్మాన్ని ఎదుర్కొనే అగత్యం రాసి పెట్టి ఉంది. యుద్ధకాలాన్ని పెంచడం ఇష్టంలేక - పాండవులు 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అనుకుంటూ వారిని తుదముట్టించి ధర్మసంరక్షణ చేసారు.

యుద్ధారంభంలో పాండవ సైన్యాన్ని చూసిన సుయోధనుడు - వారి బలం గొప్పదే ఐనా - భీష్ముని సంరక్షణలో ఉన్న తమ సైన్యం అజేయమైనదని నిర్ణయించి, 'అయనేషు చ సర్వేషు, యథాభాగ మనస్థితాః, భీష్మమే వాభి రక్షంతు, భవంతః సర్వ ఏవహి' (కనుక మీరంతా మీమీ స్థానాల్లో సుస్థితులై నలువైపులనుండీ భీష్ముని రక్షిస్తూండండి) అని తన వారిని ప్రబోధించాడు. అదే సమయంలో అర్జునుడు రణభూమిలో తనవారిని చూసి విచిలితుడై 'నకాంక్షే విజయం కృష్ణ, న చ రాజ్యం సుఖాని చ, కిం నో రాజ్యేన గోవింద, కిం భోగైర్జీవితేన వా' అంటూ యుద్ధానికి విముఖుడయ్యాడు.

కౌరవులకూ, పాండవులకూ ఉన్న ఈ భేదాన్ని స్పష్టం చేసాకనే మహాభారతంలో గీతా ప్రవచనం ప్రారంభమౌతుంది.

పాండవులు తమకు తాముగా అధర్మం చేయలేదు. శ్రీకృష్ణుని భగవంతునిగా నమ్మి ఆయన చూపిన దారిలో నడిచారు. శ్రీకృష్ణుడూ అధర్మానికి పాల్పడలేదు. అధర్మాన్ని అంతం చేసాడు.

పాండవులకులాగే అంకితభావంతో, నిస్వార్ధంగా భక్తిభావాన్ని ప్రదర్శించిన వారినే భగవంతుడు ధర్మ సంస్థాపనకు ఎన్నుకుంటాడు. భగవదాదేశం లేకుండా ధర్మ సంస్థాపనకు పూనుకున్నవారు ధర్మాధర్మ విచక్షణలో 'పదుగురాడు మాట'ను పాటించి తీరాలి.